క్లుప్తంగా

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మునగపాక హైస్కూల్‌లో ఆధార్ నమోదు చేయించుకుంటున్న విద్యార్థులు

మునగపాక: ప్రతి ఒక్కరూ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఆధార్ కేంద్రం సేవలపై ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్‌కు సంబంధించిన సేవలను స్థానికంగా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగి అనిత, తదితరులు పాల్గొన్నారు.

కె.వెంకటాపురంలో పారిశుధ్య పనులు



కాలువలో పూడిక తీస్తున్న కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో బుధవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ సూచనలతో పారిశుధ్య కార్మికులు పలు వీధుల్లో పనులు చేపట్టారు. డ్రైనేజీలలో పూడిక తీసి, వీధులను శుభ్రం చేశారు. ఇళ్లల్లోని చెత్తను సేకరించి గ్రామ శివారున ఉన్న సంపద కేంద్రాలకు తరలించారు. ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రతతోనే ఆరోగ్యమని సర్పంచ్ సూచించారు.

ఫార్మా కంపెనీలో ప్రమాదంపై దర్యాప్తు చేయాలి

అచ్యుతాపురం(మునగపాక): పరవాడ ఫార్మాసిటీలోని ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ నాయకుడు రొంగలి రాము బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడికి రూ.కోటి పరిహారం అందించాలన్నారు. ఫార్మాలోని ఠాగూర్ కంపెనీలో విష వాయువులు లీకైన ఘటనలో ఒకరు మృతి చెందగా 8 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే కంపెనీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు గాలికొదిలేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కంపెనీల నిర్వహణకు సంబంధించి తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

భీమేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన



మునగపాక పంచాయతీ వీధిలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలోని భీమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. పంచాయతీ వీధిలో ఆలయ పురోహితుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసంలో భాగంగా ఏటా ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాలతో పాటు అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీ. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మునగపాక: మండల కేంద్రమైన మునగపాక బైపాస్ రోడ్డులో బుధవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. మునగపాక సచివాలయానికి చెందిన ఉద్యోగి తన విధి నిర్వహణలో భాగంగా సెల్‌ఫోన్‌లో అధికారులతో మాట్లాడుతూ బైపాస్ రోడ్డులో వస్తున్నారు. అదే సమయంలో ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీకి చెందిన గ్యాస్ బండ్ల లోడుతో ఎదురుగా మినీ వ్యాన్ వస్తుంది. ఉద్యోగిని తప్పించే క్రమంలో మినీ వ్యాన్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వ్యాన్ ఒక వైపునకు ఒరిగిపోయింది. ఈ సంఘటనలో మినీ వ్యాన్‌లోని కొన్ని గ్యాస్ సిలెండర్లు రోడ్డుపై పడిపోయాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణం సాగించేవారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రోడ్డుపై పడ్డ సిలెండర్లు పేలి ఉంటే తమ పరిస్థితి ఏంటంటూ ఆందోళనకు గురయ్యారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఈ చిత్రం చూడగానే నదిలో చేపల వేట సాగిస్తున్నారు అనుకుంటే పొరపాటే..! రాంబిల్లి మండలం పెదకలవలాపల్లి-రజాల మధ్య శారదానదిపై వంతెన లేక ప్రజలు పడుతున్న కష్టాలకు నిదర్శనమిది. ప్రాణాలు పణంగా పెట్టి కర్ర సాయంతో నదిని దాటడం సుమారు 10 గ్రామాల ప్రజలకు అలవాటుగా మారిపోయింది. వర్షా కాలం వచ్చిందంటే ఆ గ్రామాలకు వెన్నులో వణుకు పుడుతోంది. శారదానదిని దాటి వెళ్లాలంటే వారికి కత్తి మీద సాము లాంటిదే. వేసవి కాలంలో నదిలో నీటి ప్రవాహం అంతంత మాత్రంగా ఉండడంతో పెద్దగా సమస్య ఉండదు. వర్షా కాలంలో మాత్రం నదిలో నీటి ఉధృతికి రాకపోకలు స్తంభించిపోతున్నాయి.



కర్ర ఊత సహాయంతో శారదానదిని దాటుతున్న వ్యక్తి

- పెదకలవలాపల్లి-రజాల మధ్య కలగా మిగిలిన వంతెన నిర్మాణం
- శారదానదిని ఊత కర్ర సాయంతో దాటుతున్న 10 గ్రామాల ప్రజలు, రైతులు
- వర్షా కాలంలో పరిస్థితి మరీ దయనీయం
- ఏళ్లు గడుస్తున్నా నెరవేరని ప్రజాప్రతినిధుల హామీ

కర్రే ఊతం.. ప్రాణాలే పణం.!

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలంలో ప్రధాన సమస్యగా ఉన్న పెదకలవలాపల్లి-రజాల మధ్య శారదానదిపై వంతెన నిర్మాణంపై నాయకుల హామీ ఇవ్వడం తప్పా కార్యరూపం దాల్చడం లేదు. వర్షా కాలంలో శారదానది ఉప్పొంగడం వల్ల ఇరువైపులా రాకపోకలు నిలిచిపోతున్నాయి. పశువులకు పశుగ్రాసం, పంటల సాగు కోసం పుట్టీలు, కర్రల సహాయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఏళ్లు గడుస్తున్నా పెదకలవలాపల్లి, రజాల గ్రామాల మధ్య ఉన్న శారదానదిపై వంతెన నిర్మించకపోవడంతో దిమిలి, రజాల, మురకాడ, మర్రిపాలెం, కుమ్మరాపల్లి, కట్టుబోలు, పెదకలవలాపల్లి, వైలోవ, తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలు వచ్చాయంటే రాంబిల్లి మండలంలో ప్రధాన సమస్య అయిన ఈ వంతెన నిర్మాణం నాయకుల హామీకి పనికొస్తుంది. శారదానది నీరు పంట పొలాలకు అందుతుంది కానీ.. నదిపై వంతెన లేకపోవడంతో రైతులు, ప్రజలు వ్యవసాయ పనులకు నదిని దాటుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. నదికి ఇరువైపులా పెద కలవలాపల్లి, వైలోవ గ్రామాలకు చెందిన పంట పొలాలు ఉన్నాయి. అలాగే దిమిలి పరిసర గ్రామాల ప్రజలు రాంబిల్లి మండల కేంద్రానికి రావాలంటే ఈ నదిని దాటుకొని రావాల్సిందే. శారదానదిలో వేసవి కాలంలో నీటి మట్టం తగ్గుముఖం పట్టినప్పుడు ఆయా గ్రామాల ప్రజలు నదిలో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసుకుంటారు. ఆ రోడ్డు మీదుగా రాంబిల్లికి రాకపోకలు సాగిస్తారు. వర్షాకాలం వచ్చిందంటే ఆ రోడ్డు మార్గం నీట ప్రవాహంలో కొట్టుకుపోతుంది. ఆ సమయంలో పెదకలవలాపల్లి-రజాల గ్రామాల మధ్య సుమారు 10 గ్రామాల వరకు ప్రజలు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. దిమిలి పరిసర గ్రామాల ప్రజలు నారాయణపురం, కొత్తూరు, మామిడివాడ, వెంకటాపురం గ్రామా లు తిరిగి రాంబిల్లి మండల కేంద్రానికి సుమారు 20 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తోంది.



పుట్టీలో శారదానదిని దాటుతున్న ప్రజలు(ఫైల్)



పెదకలవలాపల్లి-రజాల మధ్య శారదానదిలో వేసిన గ్రావెల్ రోడ్డు

కర్రల సహాయంతో నదిని దాటుతున్నాం..



ఏళ్లుగా పెదకలవలాపల్లి-రజాల గ్రామాల మధ్య శారదానదిపై వంతెన నిర్మాణం కలగా మిగిలిపోయింది. మా పంట పొలాలకు కర్రలు, పుట్టీల సహాయంతో నదిని దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మేత కోసం పశువులను కూడా నదిని దాటుకొని తీసుకెళ్లాలి. వంతెన కోసం అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ఫలితం ఉండడం లేదు.

– బద్ది ఆనంద్, వైలోవ గ్రామం

వంతెన కోసం ప్రతిపాదనలు

2009 కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు కేటాయించారు తప్ప పనులు చేపట్టలేదు. దీంతో ఆ నిధులు మరుగునపడ్డాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో వంతెన నిర్మాణానికి విశాఖ డెయిరీ యాజమాన్యంతో కలిసి నిర్మించడానికి సన్నాహాలు జరిగాయి. ఇంతలో ఎన్నికలు సమీపించడంతో ఆ ప్రక్రియ కూడా ముందుకు సాగలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఆ ఊసే లేకుండా పోయిందని రైతులు నిట్టూరుస్తున్నారు. వంతెన లేకపోవడంతో రైతులు పండించిన పంటలను సుదూర ప్రాంతాల మీదుగా తిరిగి తెచ్చుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. పెదకలవలాపల్లి-రజాల గ్రామాల మధ్య శారదానదిపై వంతెన నిర్మాణం కోసం ఆయా గ్రామాల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రైతులకు ఎంతో మేలు



పెదకలవలాపల్లి-రజాల గ్రామాల మధ్య శారదానదిపై వంతెన నిర్మాణం చేపడితే రైతులు, ప్రజలు రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటుంది. వర్షాకాలంలో వరి నాట్లు వేసుకోవడం కోసం రైతులు నదిని కర్ర సహాయంతో దాటుకుని అవతల, ఇవతల ఉన్న పంట పొలాలకు వెళ్తుంటారు. ఆ సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. వంతెన నిర్మాణం చేపట్టితే రైతుల కష్టాలు తీరుతాయి.

– కరణం శ్రీహరి, దిమిలి

10 గ్రామాలకు ప్రయోజనం



శారదానదిపై వంతెన లేక ప్రజలు తమ పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. నదిలో దిగి పొలాలకు పశుగ్రాసం, వరినాట్లు వేసుకోవడానికి వెళ్లినప్పుడు పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలి. ఇక్కడ వంతెన నిర్మిస్తే 10 గ్రామాల ప్రజలకు అటు ఇటూ రాకపోకలు సాగించడానికి వీలవుతుంది.

–జి.దేముడునాయుడు, సీఐటీయూ మండల కార్యదర్శి, రాంబిల్లి

రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

అచ్యుతాపురం(మునగపాక): రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ కోరారు. అచ్యుతాపురం బ్రాండెక్స్‌లో పని చేస్తున్న డ్రైవర్లకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు అతివేగం సరికాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

పోస్టాఫీసుల్లో ఎన్‌పీసీఐ ఖాతాల నమోదు

అచ్యుతాపురం(మునగపాక): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రతి ఒక్కరూ పోస్టాఫీసుల్లో ఎన్‌పీసీఐ ఖాతాలను తెరవాలని తపాలా శాఖ అనకాపల్లి డివిజన్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో సూచించారు. ఆధార్ అనుసంధానంతో ఖాతాలు తెరిచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆధార్‌తో ఖాతాలు తెరకవకపోవడంతో లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనకాపల్లి డివిజన్‌లో 2.6 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా.. పోస్టాఫీసు ద్వారా 25,000 మంది మాత్రమే ఎన్‌పీసీఐ ఖాతాలు ప్రారంభించారన్నారు. ఇందు కోసం ప్రతి ఒక్కరూ సమీపంలోని పోస్టాఫీసుకు వెళ్లి ఆధార్ అనుసంధానంతో కూడిన ఎన్‌పీసీఐ ఖాతాను ప్రారంభించాలని ఆయన కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

పాయకరావుపేట: మండలంలోని కందిపూడి గ్రామంలో బుధవారం కార్తీక మాసోత్సవాల్లో భాగంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపాలు వెలిగించి, అందులోని జ్ఞానం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఆదివారం సృష్టి మొదలుకు, సోమవారం ఆత్మ జ్ఞానంకు, మంగళవారం మోక్షంకు గుర్తు అని తెలుసుకోవాలని చెప్పారు. గురువు ఇచ్చిన జ్ఞానాగ్ని ఆరిపోకుండా వెలిగేలా ఉండాలి అంటే జీవుడు ఆత్మతో యోగం అవ్వాలి, అందుకే రెండు ఒత్తులను పెనవేసి ఉంచుతారని చెప్పారు. ప్రమిదలో నూనె అయిపోయినప్పుడు మట్టి ప్రమిదలను పారవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు బి.శాంతరాజు, సభ్యులు జలంధర్, సత్యవతి, స్వాతి, నందన, సర్వజిత్తులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావం.. వరి కోతలు ఇప్పుడొద్దు



జంపపాలెంలో రైతులకు సూచనలిస్తున్న ఏవో పాలిమేర మోహనరావు



రైతులకు అవగాహన కల్పిస్తున్న పాయకరావుపేట వ్యవసాయాధికారులు

యలమంచిలి రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో రానున్న రెండ్రోజుల్లో తేలికపాటి వర్షాలు కురవనున్న నేపథ్యంలో రైతులు వరి కోతలను మరి కొన్ని రోజులు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పాలిమేర మోహనరావు సూచించారు. బుధవారం మండలంలోని జంపపాలెం, తురంగలపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరి కోతలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఇప్పటికే కోతలు పూర్తి చేసిన రైతులు వరి పనలను కుప్పలుగా వేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రబీ సాగుకు సంబంధించి పెసలు, మినుములు, రాగి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం కొన్ని చోట్ల వరి పంటను రెల్లురాల్చు పురుగు ఆశిస్తోందన్నారు. దీని నివారణకు పెర్మెత్రిన్ మందును ఎకరాకు 400 మిల్లీలీటర్ల మందును నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. ఆకుముడత పురుగు నివారణకు చర్యలు తీసుకుంటే మంచి దిగుబడులు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అరుణ, అభ్యుదయ రైతులు నాయుడు, కనకారావు, రమణ పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం, అరట్లకోట గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ సిబ్బంది పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి పంట బీమా కోసం ఎకరానికి రూ.600, అపరాలకు రూ.300 చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ, కేవీకే శాస్త్రవేత్త శ్రీహరిరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ గుప్త, గ్రామ ఉద్యాన సహాయకులు వీరబాబు, రమ్య, శ్రుతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో ఉత్సాహంగా పేటతుళ్లి



వాడ్రాపల్లిలో పేటతుళ్లి ఆడుతున్న అయ్యప్పస్వాములు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం పేటతుళ్లి కార్యక్రమం సందడిగా సాగింది. అయ్యప్ప మాలలు ధరించిన భక్తులు గ్రామంలోని చినరామస్వామి ఆలయం నుంచి డప్పు వాయిద్యాల నడుమ నృత్యం చేస్తూ ఉత్సాహంగా పేటతుళ్లి ఆడారు. వాడ్రాపల్లి, గొల్లలపాలెం, మల్లవరం, కుంచవానిపాలెం తదితర ప్రాంతాలకు చెందిన స్వాములు ఈ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం మళ్ల వరహా నరసింగరావు స్వామి ఇంటి వద్ద చద్ది ఆరగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు భక్తులు అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు.

గెడ్డ పోరంబోకు స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురంలో గెడ్డపోరం బోకు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని రైతులు మోహనరావు, శ్రీనివాసరావు బుధవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 64/1లో పలువురు ఆక్రమ నిర్మాణాలు చేపట్టినా ఇంతవరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆక్రమణలను తొలగించడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణలను తొలగించకుంటే గురువారం ధర్నా చేపడతామని వారు హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



తిమ్మాపురం సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

ఎస్.రాయవరం: మేజర్ పంచాయతీ తిమ్మాపురం గ్రామంలో రూ.59 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు సర్పంచ్ కర్రి సత్యనారాయణ తెలిపారు. గ్రామంలో సాధారణ నిధుల నుంచి రూ.15 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.11 లక్షలతో తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఇప్పటికే శివారు గ్రామం గోకులపాడులో రూ. 28 లక్షలతో రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బొండా దివాణం, వార్డు మెంబర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలిపులి



కోటవురట్లలో కమ్ముకున్న పొగమంచు

కోటవురట్ల: మైదానంలో చలిపులి వణికిస్తోంది. మిట్ట మధ్యాహ్నమైనా సూరీడు కానరాక ముసురుకున్న మంచుతో చలి గజగజలాడిస్తోంది. బుధవారం పొగమంచు రహదారులను కమ్మేసింది. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏజెన్సీని తలపిస్తూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు జనాలను వణికిస్తున్నాయి. దాంతో బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ఉన్నిదుస్తులు ధరించి రోజువారీ దినచర్యలు చేసుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి.

‘పూడిమడక రోడ్డు విస్తరణ కొలతల్లో తేడా’

అచ్యుతాపురం(మునగపాక): పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు సర్వే చేసి కొలతలు చూపించలేదని హరిపాలెం గ్రామానికి చెందిన రోడ్డు విస్తరణ బాధితురాలు మారిశెట్టి రమణమ్మ బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా కొలతల్లో తేడా ఉందని సర్వే కోసం రెవెన్యూ కార్యాలయానికి అర్జీ పెట్టినా ఇంత వరకు న్యాయం జరగలేదన్నారు. అన్నదమ్ముల వాటాగా వచ్చిన 72 చదరపు గజాల్లో ఉన్న ఇంటిని 47 గజాలుగా చూపిస్తున్నారన్నారు. పుట్టినప్పటి నుంచి ఈ స్థలంపై తమకు మమకారం ఉందని, మరో చోటకు వెళ్లేది లేదని ఆమె వాపోయారు. తనకు అధికారులు న్యాయం చేయాలని కోరారు.

ట్రాక్టర్ల యజమానులపై బైండోవర్ కేసులు తగదు



డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎంపీపీ గోవింద్, నాయకులు

యలమంచిలి రూరల్: గతంలో ఎప్పుడూ లేనివిధంగా యలమంచిలి పట్టణం, గ్రామీణ పోలీస్ స్టేషన్ల పరిధిలో కొందరు ట్రాక్టర్ల యజమానులపై బైండోవర్ కేసులు పెట్టడం అన్యాయమని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఈ మేరకు వారు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, యలమంచిలి రూరల్ ఎస్‌ఐ ఎం.ఉపేంద్రలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. యలమంచిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు పోలీసులు, రెవెన్యూ అధికారులను కలిసి ట్రాక్టర్ల యజమానుల జీవనోపాధిని దెబ్బతీసే ఈ బైండోవర్ కేసుల నమోదును విరమించుకోవాలని కోరారు. గతంలో ఎన్నికల సమయంలో మాత్రమే బైండోవర్ కేసుల నమోదు చూశామని, ఇప్పుడు ఇలా చేయడమేమిటో తమకు అర్థం కావడం లేదన్నారు. గ్రావెల్, ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న కారణంతో పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో బైండోవర్ కేసులు పెట్టడానికి సిద్ధమయ్యారని చెప్పారు. యలమంచిలి పరిధిలో సుమారు 70 వరకు ట్రాక్టర్లు తిరుగుతుండగా.. 20 మంది యజమానులపై మాత్రమే బైండోవర్ కేసులు పెట్టడం వల్ల ఆయా కుటుంబాలు జీవనోపాధి కోల్పోతాయని ఎంపీపీ బోదెపు గోవింద్ యలమంచిలి రూరల్ ఎస్సై ఉపేంద్ర దృష్టికి తీసుకెళ్లారు. ఈ పద్ధతి గతంలో ఎప్పుడూ చూడలేదని, ట్రాక్టర్ల యజమానులను ఇబ్బందులకు గురిచేసే బైండోవర్ కేసులు నమోదు సమంజసం కాదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్ అభిప్రాయపడ్డారు. ఈ వినతిపత్రాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు పంపించామని తహసీల్దార్ కె.వరహాలు బుధవారం రాత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లు సుంకర మరిణేశ్వర్రావు, రాపేటి సంతోష్, పిట్టా సత్తిబాబు, గొర్లి వెంకట్, ట్రాక్టర్ల యజమానులు పడాల శ్రీను, సుందరపు శ్రీను, టి.నానాజీ, పడాల బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల నిలుపు మహోత్సవం



గౌరీపరమేశ్వరులను ఊరేగిస్తున్న భక్తులు



కోలాటం ఆడుతున్న కళాకారులు

మునగపాక: మునగపాకలో బుధవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల నిలుపు మహోత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవ విగ్రహాలను డప్పు వాయిద్యాల నడుమ భక్తులు ఊరేగించారు. ఈ ఊరేగింపు ఆలయం నుంచి ప్రారంభమై మెయిన్ రోడ్డు, పల్లపు వీధి, సంతబయిల, మధ్యవీధి, పంచాయతీ వీధి మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. పలువురు భక్తులు గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ఊరేగింపులో భాగంగా ప్రదర్శించిన మహిళల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, గౌరీపరమేశ్వరుల ఆలయ కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, పెద్దలు పాలిమేర కృష్ణ, దాడి ముసిలినాయుడు, టెక్కలి కొండలరావు, ఆడారి సూరిబాబు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు



కొత్తపోలవరంలో పొక్లెయిన్‌తో కొండను తవ్వుతున్న దృశ్యం

ఎస్.రాయవరం: మండలంలో మట్టి, గ్రావెల్, రాయి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సొంత అవసరాలకు మరికొందరు అనుమతులు లేకుండా కొండల నుంచి గ్రావెల్ తవ్వకాలు చేపట్టి తరలించుకుపోతున్నారు. ఇప్పటికే పెదగుమ్ములూరు, కొత్తపోలవరం, జేవీపాలెం, దార్లపూడి తదితర గ్రామాల్లో బహిరంగంగా గ్రావెల్ తవ్వకాలు చేసి భూములు చదును చేసుకుంటున్నారు. కొత్తపోలవరం గ్రామంలో కొండను బుధవారం తవ్వుతుండగా స్థానికులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. మళ్లీ సిబ్బంది వెళ్లిపోయాక కొండను తవ్వడం ప్రారంభించారని స్థానికులు చెబుతున్నారు. ఇదంతా టీడీపీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.